గ్రాంఫోనియం

●'కూచి' సాయిశంకర్

ఎప్పుడూ కళకళ్ళాడుతూ తీర్థం రోజుల్లో గుడిలా సందడిగా వుంటే వెంకట్రావు మాష్టారి ఇల్లు ఈ మధ్య ఎంతో నిశ్శబ్దంగా ఉంటోంది. వెంకట్రావు మాష్టారూ, ఆయన భార్య (బి.కామ్. నాలుగోసారి), ముద్దుల కూతురు విశాలాక్షి, (పదో క్లాసు మూడోసారి) కాక ఆ ఇంటికి కాకపోతే ఆ వీధికి పెద్ద దిక్కు 'బామ్మగారు' ఆ ఇంటి జనాభా.

మధ్య తరగతిలో వున్నా, సుఖ దుఃఖాలున్నా ఏ ఒడిదుడుకొచ్చినా గుట్టుగా ఇంటిని లాక్కొస్తున్నారు వెంకట్రావ్ మాష్టారు. ఎప్పుడూ ఆనందం వెల్లివిరుస్తూ సందడిగా వుందనుకునే ఆ ఇంట్లో ఈ మధ్య అలాంటి జాడలేవీ లేకపోవడమేవిటాని పక్కింటి పరంధామయ్యకీ, ఎదురింటి వైద్య విద్వాన్‌కీ, వీధిలోని సర్వులకూ ఆశ్చర్యాన్ని కలిగించింది.

దీనికి కారణం ఆ ఇంట్లోని జనాభా యావత్తూ కట్టకట్టుకుని ఏ కొత్తతెలుగు సిన్మా మాడ్డమో లేక వెనకింటి శర్మ డాక్టర్ గారింట్లో టీవీలో తెలుగు కార్యక్రమాలు మాడ్డమో కాదు. కాకపోతే ఆ ఇంట్లోని స్తబ్దతకి ఓ ముఖ్య కారణం వుంది. అదే మాష్టారింట్లో అనాదిగా వున్న "గ్రాంఫోన్"(రికార్డు కంపెనీ కుక్క ముందుండే పాతకాలపు పువ్వు మార్క్ గొట్టంతో వుండి చేత్తో ఆపరేట్ చేసేది) పోయింది. ఆ... ఆ మాత్రం దానికి అంత బాధెందుకూ అనుకోవచ్చు. కానీ అలా అనుకోకూడదు. కారణం ఆ గ్రాంఫోను ఆ ఇంటి పెద్ద దిక్కు బామ్మగారిది. ఆవిడకి చిన్నప్పుడు జరిగిన పెళ్ళిలో ఆవిడ పెదనాన్నగారి వియ్యంకుడి తమ్ముడు పెళ్ళికానుకగా వదివించింది. ఆ కాలంలో సంగీతమన్నా, నాట్యమన్నా చెవే కాక ముక్కు కూడా మొదలంటా కోసుకునేది బామ్మ. ఇక పోతే ఆ గ్రాంఫోన్ అతి కష్టం మీద బామ్మ చిన్నతనం మొదలు ఇప్పటివరకూ దినదిన గండంగా పాడుతూ కాలం నెట్టుకొస్తోంది. సంప్రదాయాన్ని కాదని సంగీతాలూ, నాట్యాలూ నేర్చుకోలేక వున్నంతలో గ్రాంఫోన్ సాహచర్యంలో మినుపసున్ని కలుపుతూనో లేక అమాన్ దస్తాలో వక్కలు దంచుతూనో కాలం గడిపేది బామ్మ. ముఖ్యంగా భర్త పోయినప్పట్నుంచి (ఈ గ్రాంఫోన్ బాధ పడ్లేకేమో పాపం!) "పాడు జీవితమూ... యవ్వనం - మూడు నాళ్ళా ముచ్చటేగా" అనే పాట వింటూ కాలాన్ని వెళ్ళబుచ్చుతోంది. ముఖ్యంగా ఆ పాట మొత్తంలో చరణాలు కంటే పల్లవినే పదే పదే వేసుకు విని ఆనందించేది.

అది పోయినప్పట్నుంచీ బామ్మలో ఉత్సాహశక్తి తగ్గింది. వయసు మీద పడ్డా ఝుణఝుణలాడుతూ కుంభకోణం కంచు గంటలా వుండే బామ్మ గొంతులో జోరు తగ్గింది. ఇంట్లోని ఇతర సభ్యులైతే ఏల్నాటి శనిలా పట్టుకున్న గ్రాంఫోన్ ఎగిరి దక్కాపోయినందుకు లోలోపల సంతోషిస్తూ పైకి మాత్రం సారోసీన్ నటిస్తున్నారు. అసలా గ్రాంఫోన్ ఎలా పోయిందనే విషయాని

● కథకు కార్టూన్



కొస్తే ఎప్పుడెక్కడికి వెళ్ళిన కూడా పట్టుకెళ్ళేది. ఎప్పటిలానే తీర్థయాత్రలకి వెళ్ళేటప్పుడు పట్టుకెళ్ళింది బామ్మ. క్షేత్ర దర్శనం. ప్రసాద సేవనం అయినతరువాత ఏ సత్రంలోనో, ఏ మూలో అందరూ పడుకున్న తరువాత తను పడుకో బోయే ముందు కాసేపు దాన్ని పెట్టుకుని తన కిష్టమైన "పాడూ జీవితం..." వినేది. తరువాత భర్త తాలూకు పొత్తు పంచె దానికి చుట్ట భద్రం చేసుకునేది.

క్షేత్ర దర్శనాలు పూర్తయ్యి రైల్లో తిరుగు ప్రయాణం చేస్తూ దొరికిన ఒక్క సీట్లో బామ్మనీ, ఆమె ఆరో ప్రాణం గ్రాంఫోన్నీ వుంచారు వెంకట్రావు మాష్టారు. చంటిపిల్లకంటే ప్రాణంగా చూసుకుంటూ మోస్తున్న గ్రాంఫోన్ని వయసు మీద పడ్డం మూలాన వచ్చిన నీరసంతో మొయ్యలేక తన సీటు కింద పెట్టి నిద్రలోకి జారింది బామ్మ. మధ్య మధ్య మెలుకువ వచ్చినప్పుడల్లా చేత్తో గ్రాంఫోన్ని తడివి జాగత్తగా చూసుకుంటూండేది. మళ్ళీ నిద్రలోకి జారిపోయేది. ప్రయాణం ఇలా సాగుతుండగా సరిగ్గా రాత్రి రెండు గంటల వేళ బామ్మ దిగవలసిన స్టేషనొచ్చింది. ట్రైన్ కొద్ది సేపే ఆగుతుందన్న ఖంగార్లో బామ్మనో చేత నడిపిస్తూ, మరో చేత సామాను మోస్తూ మొత్తానికి ట్రైన్ దిగారు వెంకట్రావు మాష్టారు. వీరు దిగడమే లేటన్నట్టు ట్రైన్ కూతేసుకుంటూ పట్టాల్ని వదిలేసింది. నిద్ర మత్తు ఇంకా వదలలేదు బామ్మని. ఐనా అరమోడ్పు కనులతో చుట్టూ వున్న సామాన్ని చూసింది. గ్రాంఫోను జాడ కనపడలేదు. దెబ్బకి నిద్ర మత్తు దిగిపోయింది బామ్మకి. మళ్ళీ చుట్టూ వున్న సామాన్ని పరికించి చూసింది. గుండెఝల్లుమంది. అంతే. రోజూ పాడే గోవింద నామాల స్వర స్థాయిల్ని అనుకరిస్తూ ఏడుపు లంకించుకుంది బామ్మ.

నిద్ర మత్తు వదిలించుకుందామని మొహం కడుక్కోడానికి వెళ్తున్న వెంకట్రావు మాష్టారు బామ్మ ఏడుపు వినగానే తన తాలూకు నిద్ర మత్తుని ధోవతీ దులిపినట్టు దులిపి ఒక్క ఉదుటన బామ్మని చేరి సంగతి విన్నారు. బామ్మని చూస్తే జాలేసింది. ఏం చేదాన్కీ పాలు పోలేదు.

బామ్మైతే ఏడుపు కంటిన్యూ చేస్తూ మధ్య మధ్య తనతోటి ప్రయాణీకుల్నీ, రైలింజన్ డ్రైవర్నీ కాష్టం కాల్చడం నుంచి సంవత్సరీకం వరకూ అంఖణా లేసుకు తిడుతూ మొటికలు విరుస్తూ స్థిమిత పడుతూ మళ్ళీ రెట్టించిన కోపంతో తిడుతూ వుంది.

పోయిందేదో పోయింది. ఈ మాటు ఊళ్ళో వున్న ఉడిపీ హోటల్ అయ్యర్తో చెప్పి చెన్నపట్నం నుంచి అలాంటి గ్రాంఫోన్నే కనీసం సెకండ్ హాండ్‌దైనా తెప్పించి ఇస్తానని ఆమె నోదార్చి ఇంటికి తీసుకొచ్చారు మాష్టారు. అది లగాయతు గ్రాంఫోను తెప్పించంటూ హఠయోగాలూ అవీ అవలంబిస్తోంది బామ్మ. కాలం గడుస్తోంది. ఈ లోపుగా కాఫీ పొడికి వచ్చేనాంచారమ్మలూ, బామ్మతోడి పూర్వసువాసినులూ గ్రాంఫోన్ విషయమై బామ్మకి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేడం కొనసాగుతోంది. అది జ్ఞాపకం రాగానే బామ్మ మళ్ళీ మొదటికొచ్చేది. బామ్మ గ్రాంఫోన్ విషయం ఊళ్ళో చర్చనీయాంశమైంది కొద్ది రోజులు.

ఇలా వుండగా ఓ రోజు ఎప్పట్లానే సాయంత్రం బడి నుంచి వచ్చారు వెంకట్రావు మాష్టారు. ఇంట్లో భార్యా పిల్లల అలికిడేమాత్రం వినబడలేదు ఆయనకి. మామూలుగానే కాళ్ళు కడుక్కుందామని ఆరేడు గదుల మండువా దాటి పెరట్లో కెళ్ళారు. అంతే...

"పాడు జీవితమూ- యవ్వనం....." మెల్లగా వినబడింది మాష్టారికి. అంతే. ఆయన కళ్ళు మెయిల్ చక్రాల స్పీడులో తిరిగాయి. 'ఇదెక్కడి ప్రారబ్దంరా భగవంతుడో - మళ్ళీ ఎలా దాపురించిందీ తద్దినం' అని స్వగతంలో అనుకుంటూండగా...

"ఒరేవ్ వెంకటా! నా గ్రాంఫోన్ పోయిందని తెలిసీ బాధపడీ అచ్చుమచ్చు అలాంటి దాన్నే చెన్నపట్నం నుంచి తెచ్చాడురా పొద్దున అయ్యరు..." అంటూ ఏదో చెప్పబోతోంది. వెంకట్రావు మాష్టారు అచేతనులయ్యారు. కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళకోసం పట్టుకున్న కంచు చెంబు గోలెంలో ఖదులు నూతిలో పడింది.

*